# టైగర్

మా టైగరు పేరుకు మాత్రమే టైగరు. అది సీమకుక్క కాదు, వేటకుక్కా కాదు. కుక్క పెద్దదే కాని చూసేవాడి గుండె లదరజేసే భయంకర లక్షణాలేమీ దానిలో లేవు. సాహసమనలే శూన్యం. పిరికితనానికి ముందు పుట్టింది. పోనీ మరో అందమేనా ఆకర్షణేనా ఉందా అంటే అదీ లేదు. అది మామూలు గోధుమరంగు ఊరకుక్క. అటువంటి కుక్కను మేము పెంచడమేమిటి? దానికి టైగరు అని పేరు పెట్టడమేమిటి అనిపిస్తుంది. ఎవరికైనా. ఈ విషయం మాకూ ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది.

దానిని మేము ఎక్కడినుంచో తీసుకురాలేదు. అదే వచ్చింది. అంతకుముందు ఎక్కడ ఉండేదో ఎలా ఉండేదో కాని ఒక రోజున మరో పది కుక్కలు తరుముకు వస్తూంటే అది మా యింటికేసి పరుగెత్తుకు వచ్చింది. అది తోకముడుచుకొని పరుగెత్తుతూ మధ్యమధ్య తరుముకువస్తున్న కుక్కలవైపుకు తిరిగి గుర్రుమంటోంది. అది తల తిప్పేసరికి వెనకనుంచి కుక్కలు దానిని కరుస్తున్నాయి. అది అలాగే అడుగడుగుకీ తిరుగుతూ తంటాలు పడుతూ మా దొడ్డి వరకూ వచ్చి ఒక్క ఉరుకులో దొడ్డిలోకి వచ్చి పడింది ప్రాణం కాపాడుకుందుకు. కుక్కలదండు వెన్నంటింది. వాటిబారినుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది. కుక్కల గోల విని మా గోపీ, మా అన్నయ్య పిల్లలు రాముడూ, కృష్ణుడూ, సుబ్బారావూ ద్వారుడుమూత ఆట కట్టిపెట్టి పరుగెత్తుకు వచ్చారు. కొంతసేపు తమాషా చూస్తూ నిలబడ్డారు. చివరికి అలా పది కుక్కలు ఒక్క కుక్కమీద పడటం చాలా అన్యాయమని తోచింది కాబోలు. వాళ్ళు ఆ ఒంటికుక్క పక్షం తీసుకొని దాడి వచ్చిన దండును కర్రలతో తరిమివేశారు. అంతవరకు ముందు వరకూ తోక ముడుచుకున్న కుక్క మళ్ళీ ధైర్యం రాగా పెద్దగా అరుస్తూ కొంత దూరం దండు వెనకాల పరుగెత్తి తిరిగివచ్చి అరుస్తూ నిలబడింది రంగం తనదే అయిందని చెపుతున్నట్లుగా. దాని గోల నాకు చిరాకు కలిగించింది కాని దానినప్పుడు తరిమివేస్తే అది మళ్ళీ ఆ దండుబారిని పడుతుందని ఊరుకున్నాను.

గోపీవాళ్ళు ఆ కుక్కకేసే చూస్తూ నిలబడ్డారు. గోపీ నన్ను కేక వేశాడు. "నాన్నా చూడు పాపం ఈ కుక్కనెలా కరిచాయో అవన్నీ" అని. నేను వెళ్ళి చూశాను. నిజంగానే దాని ఒంటిమీద చాలా కాట్లున్నాయి. అది ఆ కాట్లు నాకుతూ, ఆయాసపడుతూ, మధ్య మధ్య దండుపోయిన వైపుకు తిరిగి అరుస్తోంది. "సరే దానినేమీ చేయకండి. దానిదారి వదే పోతుంది." అని చెప్పి నేను నా కుర్చీలో కూలబడ్డాను. పిల్లలు కుక్క దగ్గరనుంచి కదలలేదు. కొంతసేపటికి నలుగురూ ఏమి ఆలోచించుకున్నారో వంటింటివైపుకు పరుగెత్తారు. అక్కడ వాళ్ళకు చీవాట్లు ఎదురయ్యాయి కాబోలు నాదగ్గరికి పరుగెత్తుకు వచ్చారు. "నాన్నా, కుక్కకన్నం పెట్టమంటే పెట్టలేదు చూడు" అన్నాడు గోపీ. నేను వాడితల్లిని కేకవేసి "పోనీ కాస్త 'అన్నం' పడేయకూడదూ" అన్నాను. పిల్లలు అన్నం ఆకులో పట్టుకు వెళ్ళి కుక్కముందు పెట్టారు. అది ఒక్క నిమిషంలో ఆకు ఊర్చి వేసింది. వాళ్ళు 'పాపం పాపం' అంటూ అక్కడే నిలబడి ఉన్నారు. "ఇకపోయి ఆడుకోండిరా" అనేవరకూ వాళ్ళు అక్కడనుంచి కదలలేదు.

పిల్లలు రాత్రిపోయి చూస్తే ఆ కుక్క అక్కడే ఉంది. మళ్ళీ అన్నం పెట్టారు వాళ్ళు. మర్నాడు పొద్దున్న పెట్టారు. రాక రాక మంచిచోటుకే వచ్చి పడ్డామనుకుంది కాబోలు. అది మా దొడ్లోనే స్థిరనివాసమేర్పరచుకుంది. మా పిల్లల స్నేహం సంపాదించడానికి పూనుకుంది. పిల్లలు కనబడగానే తోక ఆడిస్తూ పరుగెత్తుకురావడం, నేలమీద వంగి నమస్కారాలు చేయడం, వాళ్ళ కాళ్ళముందు నేలమీద వెల్లకితలపడి కాళ్ళు పైకి తిప్పుతూ కూకుకూకుమని కూయడమూ మొదలుపెట్టింది. పిల్లలనే కాకుండా పెద్దలను కూడా మంచి చేసుకోవడం చాలా అవసరమనుకుంది కాబోలు మేమెవరం వెళ్ళినా అలాగే నమస్కారాలు చేస్తోంది.

పిల్లలప్పుడే దానికి 'టైగరు' అని పేరు పెట్టివేశారు. 'టైగరేమిటిరా, అది ఉత్త పిరికికుక్క అయితే" అన్నాను నేను. అయినా వినిపించుకుంటేగా వాళ్ళు. అది టైగరు కాకపోయినా దాని నలా పిలుచుకోవడం వాళ్ళకు గొప్పగా ఉంది. వాళ్ళప్పుడే దానిని స్నానం చేయించివేశారు. పుళ్ళకు పౌడరద్దివేశారు. దానితో కబుర్లు చెప్పడం కూడా మొదలుపెట్టారు. తరువాత అందరూ

వాసమూర్తి

కలిసి గోపీని వాడగ్గరికి 'డిప్యుటేషన్' పంపారు. "నాన్నా, మా టైగరుకో బెల్టూ గొలుసూ తెప్పించవూ" అని అడిగాడు గోపీ. అదేపనిగా వేధించగా బజారునుంచి బెల్టూ గొలుసూ తెప్పించక తప్పిందికాదు. ఆ బెల్టు టైగరు మెడలో బిగించి, గొలుసుతగిలించి దానితో ఊళ్ళోకి షికారుకు బయలుదేరారు గర్వంగా. రెండురోజుల నుంచీ కడుపునిండా తిండి దొరుకుతోంది కాబట్టి వాళ్ళవెనకాల హుషారుగా పరుగెడుతోంది టైగరు. బెల్టూ గొలుసూతో టైగరు చూడడానికి బాగానే ఉందనిపించింది.

గోపీకీ, మా అన్నయ్య పిల్లలకీ అస్తమానూ కుక్కగొడవతప్ప మరొకటి లేకపోయింది. దాని కప్పుడే వెనకకాళ్ళమీద లేవడం, నడవడం నేర్పివేశారు. ఇంకా ఎన్నో 'ఫీట్సు' నేర్పయత్నంలో ఉన్నారు. ఎప్పుడో కుక్కల సర్కసు పెట్టాలనీ, దానికి కానీ కానీ టికెట్టు పెట్టాలనీ నిశ్చయించుకున్నామని నాతో చెప్పాడు గోపీ. తమ సర్కసుకి ఎవరెవరిని ఊరికే రానీయవచ్చో ఆలోచిస్తున్నారట. నా పేరు లిస్టు మొదట్లోనే ఉందట. తమ టైగరు ప్రతాపం చూపించేందుకు వాళ్ళు దానిని ఊళ్ళో కుక్కలమీదికి ఉసికొల్పుతున్నారు. అది పెద్దగా అరుస్తూ ముందు కురికేది. అవతలది దానికన్నా పిరికిదైతే దాని బండారం బయటపడేదికాదు. కాని అవతలదే కాస్త మొండి రకము అయితే టైగరు చటుక్కన వెనక్కి పరుగెత్తుకువచ్చి మాగోపీగాడివాళ్ళ వెనక నిలబడి మహాపౌరుషంతో అరచేది. మాయింటికెవరు వచ్చినా అరిచేది. దాని అరుపులకు భయపడి ముష్టివాళ్ళుకూడా రావడం మానివేశారు మాయింటికి. అదీ మంచిదే అనుకున్నాం కాని రెండురోజుల తరువాత ఒక గడుగ్గాయి ముష్టివాడు కర్ర చూపి బెదరించాడు దానిని. అంతే అప్పటినుంచీ బిచ్చగాడెవడైనా వస్తున్న అలికిడైతే చాలు టైగరు వీధిలో ఎక్కడా కనబడేది కాదు.

మరిరెండు రోజులికి మా అన్నయ్య ఊరునుంచి తిరిగివచ్చాడు. అన్నయ్యను చూడగానే. టైగరు 'భౌంయ్, భౌంయ్'మంటూ అడ్డుపడింది. గోపీవాళ్ళు కంగారుగా పరుగెత్తుకు వచ్చి గొలుసు పట్టుకొని దానిని దొడ్లోకు లాగుకుపోయారు. "ఏమిటిరా ఈ వెధవకుక్క ఎక్కడినుంచి వచ్చింది? మన అరుగుమీదనుంచి అరుస్తొందేమిటి?" అని అడిగాడు అన్నయ్య. మా అన్నయ్య దృష్టిలో కుక్కను పెంచడంవంటివి వెర్రి వేషాలు. అవి ఏమీ గిట్టవు. అందువల్ల నేను

అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పకుండా మరో విషయం మీదికి మళ్ళించాను. "వెళ్ళినపని ఏమయింద"ని.

కాని అన్నయ్యకు తెలియకుండా ఎంత కాలం ఉంటుంది. పిల్లలు పైగరును పెంచుకున్నారని "ఏరా వెధవెల్లారా, దానిని వెంటనే వదిలి పెట్టేస్తారా లేదా" అని కేకలు వేశాడన్నయ్య. పైగరు అన్నయ్యముందు చాలా ప్రాధేయపడింది. 'తాము ఫలానా అని నాకు మొదట్లో తెలియలేదు. అందువల్ల అలా అరిచాను. ఇంకెప్పుడూ అలా చేయను నన్ను తరిమి వేయకండి.' అని తనభాషలో ఏదో చెప్పుకుంది. కాని అన్నయ్యకు పక్కిభాష తెలియదు. కాబట్టి పైగరు ప్రార్థనలన్నీ నిష్ఫలమయ్యాయి. అన్నయ్య కర్ర తీసుకు వచ్చారు. అన్నయ్య చేతిలో కర్రచూసిగా పైగరు ప్రాణం సంకటంలో పడింది. తన రక్షకులకేసి చూసింది ఆశగా-కాని వాళ్ళు నలుగురూ ఒక్క మొగాలు వేసి ఏమీ చేయలేక చూస్తూ నిలబడ్డారు. పైగరు ఇక లాభం లేదనుకొని నేలమీద సాష్టాంగ పడింది. ఘిల్లకిలాపడింది. అన్నయ్య కర్రతో తోశాడు. అది కదలలేదు. నేలకంటుకు పోయినట్లుంది. అన్నయ్య కొఖరుకు మండి కర్రతో ఒకటి పెటాడు. అది కుయ్యో కుయ్యోమంటుందేకాని కదలదే. పిల్లలు నలుగురూ ఏడుపు మొగాలు వేశారు. గోపీ కళ్లలో నీళ్లు స్పష్టంగా నిలిచాయి. అన్నయ్య మళ్ళీ ఇంకొకటి వేశాడు. ఆఖరికి ఉండలేక నేనే అన్నాను. పోనీలే అన్నయ్యా, పిల్లలేదో ఏడుస్తారు. దానివల్ల మనకు పెద్ద ఇబ్బంది లేదు కదా. పూటకు కాసిని అన్నం మెతుకుల ఖర్చు తప్ప. ఇది ఉండడం వల్ల కొంత దొంగల గొడవకూడా తగ్గింది."

*

అంతకు ముందు మాకు దొంగలబాధ ఒకటి ఎక్కువగా ఉండేది. దొంగతనాలంటే పెద్దవి కావు దొడ్లో ఏదుంటే అది ఎత్తుకుపోవడం వంటివే జరిగేవి ఆఖరికి పుల్ల వుంటే పుల్ల, పుడక వుంటే పుడక, ఎత్తుకుపోయేవారు. 'మా ఇళ్లు ఊరికి ప్రక్కగా ఉన్నాయి. మా ఇళ్ళ వెనకాల అన్నీ పొలాలూ, తోటలే. మాకే పెద్ద పెద్ద దొడ్లున్నాయి. అందువల్ల మేము ఎప్పుడూ భయపడుతూ ఉండవలసి వస్తూండేది. పోలీసులకు రిపోర్టు చేయడానికి తగిన దొంగతనాలా కావు. పోని గ్రామంలో నే బందోబస్తు చేదామంటే మా వూళ్ళో అంత ఐకమత్యం లేదు. అందువల్ల మాకు యీ దొంగలబాధ తప్పలేదు. కాని పైగరు వచ్చినప్పటినుంచి అదెలాంటిదో తెలియదు కాబట్టి ఎందుకైనా మంచిదని దూరంగానే ఉండిపోతున్నట్లున్నారు దొంగలు.

అన్నయ్య, "సరే-అయినా దీన్ని ఆట్టే




ఈ మంచువలె నున్న క్రీమ్ మీ సౌందర్యమును అధికము చేయుటలో సహకరించును

దీనితో మీ చర్మము మృదువుగ, సహజముగ సుందరముగ ఉండును

...లోపములు కనపడక నిష్కళంకముగ ఉండును

మీరు ఎల్లప్పుడూ మనోహరముగ ఉండాలనుకోవడము సహజమే! అద్భుతమైన పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడితే సులభముగ అలా ఉండగలరు.

రోజూ ఉదయము, పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పైపైన రాసుకోండి. కొన్ని సెకండ్లలోనే అది మాయమవుతుంది! కాని అది చర్మమును నిష్కళంకముగ మృదువుగ చేస్తుంది. నవవికసిత పుష్పమువలెనున్న మీ ముఖ వర్చస్సుకు అందరూ ఆశ్చర్యపడుట మీరు గమనిస్తారు!

ముఖము మీద పౌడరు అంటుకుని ఉండేలా చేసే ఒక అద్భుతమైన సాధనము!

మీరు పౌడరు రాసుకునేటప్పుడు లేక మేకప్ చేసుకునే ముందు ప్రతిసారి జిడ్డు లేని వ్యానిషింగ్ క్రీమ్ పైపైన రాసుకోండి. అది పౌడరును గంటల తరబడి సమంగా అంటుకుని ఉండేలా చేస్తుంది! మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ రాసుకుంటే రోజంతా మీరు మనోహరముగా ఉంటారు.




పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్

నెత్తిమీద కెక్కించుకో కూడదు. ఇంట్లో తిరిగి పాడుచేస్తుంది" అని లోపలికి వచ్చే వాడు. టైగరుకు తనస్థానం తెలుసు. నెత్తి మీది కెక్కించుకుందా మన్నా నెత్తిమీద కెక్కే రకం కాదు. అది వీధి అరుగుమీద దొడ్లోనూ తప్ప ఎన్నడూ ఇంటి లోపలికి అడుగు పెట్టలేదు. మా దగ్గర ఎంత చనువయినా దూరంగానే నిలబడి తోక ఆడించేది. పిల్లలదగ్గరైనా ఎప్పుడూ కాళ్ళెత్తి వాళ్ళని తాకేదికాదు. అందువల్ల టైగరు మా ఇంట్లోనే ఉండిపోయింది. కడుపు నిండా తిండి పడడంవల్ల అది బాగా బలుస్తోంది.

కాని ఉన్నది ఊరికే ఉండక కొన్ని కొత్తచిక్కులు తెచ్చిపెట్టింది టైగరు. చుట్టు ప్రక్కల ఇళ్ళు పరిశోధించడం మొదలు పెట్టింది. రోజుకొకరి ఇంటికి వెళ్ళి చూసి వస్తోంది. మాకు కుడిప్రక్క శంకరంగారున్నారు. ఆయన కొడుకులిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. కూతురు కాపురానికి వెళ్ళిపోయింది. శంకరంగారు వ్యవసాయం చూసుకుందుకు ఇక్కడే ఉంటున్నారు. ఇంట్లో లింగూ లిటుకూమంటూ ఆయనా, ఆయన భార్యా ఉంటున్నారు. శంకరంగారి భార్యకు తగని ఆచారం చాదస్తం. రోజుకు కనీసం రెండుసార్లేనా ఇల్లంతా కడుగుతుంది ఆవిడ. ఇంటికి ఎవరేనా వచ్చి వెళ్ళిన తరువాత వాళ్ళు లేచినచోట కాసిని నీళ్లు చల్లితేకాని ఊరుకోలేదు. ఆవిడ చాదస్తము ఎంతవరకూ వెళ్ళిందంటే సాయంత్రం వేళ భర్త పొలంనుంచి ఆవును తోలుకొస్తే ఆవుమీదా ఆయనమీదా గోమయం కలిపిన నీళ్ళు చల్లితే కాని లోపలకు రానీయదు. అటువంటి ఇంటిమీద పట్టించింది టైగరు. ముఖ్యంగా శంకరం గారితో స్నేహం చేయా లనిపించింది కాబోలు దానికి. అడ్డంగా పెరిగిన ఆ స్థూలాకారం చూస్తే దానికి ప్రత్యేకాకర్షణ కలిగింది కాబోలు. ఒకరోజున శంకరంగారు గొడుగు వేసుకొని వీధిలోకి పోతున్నారు. హఠాత్తుగా టైగరు తోక ఆడించుకుంటూ ఆయన దగ్గరకి పరుగెత్తింది. శంకరంగారు చేతులు పైకెత్తి "ఏమేవ్, ఏమేవ్ రావే" అంటూ పొలికేకలు పెట్టారు. శంకరంగారి భార్య లోపలినుంచి పరుగెత్తివచ్చి చీపురుకట్ట తీసుకుని టైగర్‌ను కొట్టుతోంది. "స్నేహం చేయడానికి వస్తే ఈ మర్యాద ఏమిటి?" అన్నట్లుగా చూస్తూ టైగరు అక్కడనుంచి కదలలేదు. గోపీ వాళ్లూ పరుగెత్తుకువెళ్ళి టైగరును పట్టుకున్నాడు. "మీదా నాయనా, యీ కుక్క. ఇలా ఊరిమీదికి వదిలేస్తే ఎలా? అందరినీ కరవదూ? దిక్కుమాలిన కుక్క! దీనిమూలాన మళ్ళీ నూతి దగ్గరకి పోయి నాలుగు చేదలు నెత్తిమీద గుమ్మరించుకోవాలి" అనుకుంటూ లోపలికి పోయింది ఆవిడ. పిల్లలు టైగర్‌ను లాగుకువచ్చారు.

కాని శ్వాని దృష్టి శంకరంగారిమీదే ఉంటోంది. మళ్ళీ ఇంకోనాడు శంకరంగారు వాళ్ళ అరుగుమీద కూర్చొని ఉండడము చూసింది. అక్కడికి పరుగెత్తింది. శంకరం గారు దానిని చూసి కంగారుగా లోపలికి పరుగెత్తబోయి కాలుజారి మెట్లమీదనుంచి గుమ్మడికాయలా క్రిందకు దొర్లిపోయారు. మేము ఆయనదగ్గరకు పరుగెత్తాం. లోపలనుంచి ఆయన భార్య "అయ్యో, అయ్యో, అదేమిటండీ" అంటూ పరుగెత్తుకు వచ్చింది. శంకరంగారు మాటలేకుండా వుండిపోయారు. అది చూసి ఆయన భార్య గుండె బాదుకుంటూ "అయ్యో భగవంతుడా, ఏం కష్టం తెచ్చిపెట్టావురా? పిల్లలేనా దగ్గర లేకపోయారుగదరా భగవంతుడా. ఈ దిక్కుమాలిన కుక్క ఎక్కడనుంచి దాపురించిందండోయ్ మా ప్రాణాలకి" అంటూ పెద్ద పెట్టున 'శోకన్నాలు' పెడుతూ మధ్య మధ్య "దీని శ్రాద్ధం పెట్టా! దీనిని పొయిలో పెట్టా" అంటూ మా టైగరుని 'శాపన్నాలు' కూడా పెడుతోంది. ఊళ్లోవాళ్లు ఆవిడ యేడుపులు విని పరుగెత్తుకు వచ్చారు. మమ్మల్ని తలో మాటా అన్నారు. మేము శంకరంగారిని యెలాగో లేవదీసి నిలబెట్టి పట్టుకున్నాం. మాఅన్నయ్య అక్కడికి వచ్చి సంగతి తెల్సుకొని "వెధవకుక్కను పెంచటం నాకు మొదటినుంచీ యిష్టం లేదు. ఈ పూటే దాని భరతం పడతానుండండి" అన్నాడు. నేను శంకరంగారిని అడిగాను: "ఏమండీ ఎక్కడ కరిచింది" అని. ఆయన కళ్లుమూసుకొని ఉండిపోయారు. జవాబీయలేదు. ఆయన వరసమూసి: "అయ్యో నాయనోయ్, ఎక్కడో కరిచే ఉంటుందోయ్. ఇంక ఏం దిక్కురోయ్ భగవంతుడోయ్. వెనక మా అన్నయ్యకొడుకు ఇలా కుక్కకరిచే ఆరు నెలలకు వెళ్లిపోయాడురోయ్. ఏంరాత రాసి పెట్టావురా భగవంతుడా, భగవంతుడా—" అంటూ ఆరున్నొకటో రాగం లయతాళబద్ధంగా ఆలాపించసాగింది.

మేము శంకరంగారి మొగంమీద కాసిని చన్నీళ్లుచల్లి, కాసిని లోపలికిచ్చి, నడ్డితట్టి మళ్లీ అడిగాం కుక్క ఎక్కడ కరచిందని. ఆయన కొంతసేపటికి వేగంగా ఊపిరిపీలుస్తూ విడుస్తూ: "హ—కరవలేదు—హ—కాని—హ—దాన్ని చూసి—హ—పడిపోయాను" అని చెప్పారు. వచ్చినవాళ్లకు నవ్వాపుకోవడం కష్టమైంది. కాని ఎలాగో శంకరంగారిని లోపలికి సాయంపట్టుకువెళ్లి మంచంమీద పడుకోబెట్టాం. మా టైగరు కరిచేరకం కాదనీ, దానికేమీ ఆయన భయపడనక్కర్లేదనీ చెప్పి ఇంటికి వచ్చాను.

అన్నయ్య కర్రతీసుకొని ఇల్లంతా వెతికాడు. దొడ్డిఅంతా వెతికాడు. ఎక్కడా టైగరుకానీ, పిల్లలుకానీ కనపడలేదు. ఆ సమయంలో వాళ్లు కనిపిస్తే కుక్కనీ వాళ్లనీ కూడా చావకొట్టేవాడే. కాని పిల్లలు ఆవేళ అన్నయ్య కెదురుపడలేదు. మరి రెండు రోజులవరకూ టైగరును అన్నయ్య కంట బడకుండా చూశారు. మూడో రోజుకి అన్నయ్య కోపంకూడా చల్లబడింది. "వెధవల్లారా, పగలస్తమానూ దానిని కట్టేసుంచండి" అని చెప్పి ఊరుకున్నాడు.

శంకరంగారికి చట్ట బెణికి మూడురోజులు మంచంమీదనుంచి లేవలేదు ఆయన. తరువాతైనా వీధిలోకి పోవలసివస్తే ఒక పెద్ద కర్ర తీసుకొని ఇటూ అటూ చూసుకొని మరీ పోతున్నారు. మా పిల్లలు టైగరును పగలు కట్టే ఉంచుతున్నారు. ఎప్పుడో ఆట సమయాన్ని విడిచిపెట్టినా కూడాఉండి చూస్తున్నారు. అయినా ఎప్పుడో ఏమరుపాటున పిల్లలు కొంచెంసేపు దానిమాట మరచిపోయారు కాబోలు. అది వెంటనే ఒకసారి శంకరంగారి యింటికివెళ్ళి వచ్చేసింది. మరి కొంతసేటికి శంకరంగారిభార్య వాళ్ల గోడ అవతల నిలబడి మా యింటోవాళ్ళ నందరినీ కలిపి తిట్టడం మొదలుపెట్టింది. ఆ తిట్లు వింది మా వదినగారు. అవతల ఆవిడ ఎందుకలా అరుస్తోందో విచారించకుండానే వెంటనే



అవతల ఆవిడకు మించిన తిట్లతో గొంతుక విప్పింది. గోపీ తల్లి కూడా తోడుకోడలికి తోడయింది. నేనూ మా అన్నయ్యా: "ఊరుకోండి, ఆ విడతో సమానంగా మీరుకూడా గొంతుకలు ఎందుకు చించుకుంటారు. అన్యాయంగా తిట్టే ఆవిడ తిట్లు ఆవిడకే తగులుతాయి" అని ఎంత చెప్పినా వాళ్లు వింటేగా. వంశమర్యాద కాపాడాలనే కఠోరదీక్షతో కదనరంగంలో నిలబడారు. ఆ గోడ అవతల ఆవిడ, ఈగోడ ఇవతల వీళ్లు తిట్లతోటే, శాపనార్థాలతోటే ఒకరినొకరు చెరిగేసుకుంటున్నారు. ఇలా ఇంట్లో ఆడవాళ్లు వీధిన బడటం చూసి మాకు సిగ్గువేసింది. వీధిలో వాళ్లు చోద్యంగా వింటూ ఉంటారు 'ఈ వాగ్యుద్ధం. పోనీ మేము అడ్డుపడుదామంటే ఆడవాళ్ళ తగాదాలో మగవాళ్లు కలగజేసుకోవటం బాగుండదుకదా. కాని మరికొంతసేపటికి వీధిలో శంకరంగారి గొంతుక విని మేమిద్దరం వీధిలోకి నడిచాం. అప్పటికే జనం చాలామంది పోగై ఉన్నారు శంకరంగారు తమ అరుగుమీద నిలబడి మా యింటి వైపుకు చేయిచూపిస్తూ ఏదో అరుస్తున్నారు. మేము దగ్గరికి వెళ్ళగానే శంకరంగారు తేలుకుట్టినకోతిలా ఎగురుతూ: "ఏమిటయ్యా మీరు మర్యాదస్తులేనా. ఊరు మీ ఒక్కరిదే అనుకుంటున్నారా. ఊళ్ళో మరెవరూ ఉండకూడదనుకుంటున్నారా? మీరు మనుష్యులేనా?" అంటూ అరిచారు. మేము తెల బోతూ: "ఏమిటండీ ఇంతకీ ఏమి జరిగింది" అని అడిగాం. కాని ఆయన జవాబు చెప్పడే ఆయన కేకలేమో ఆయనవి. నేను కాస్త గట్టిగా అడిగాను: "ఏమిటో చెప్పకుండా తిట్టడమేమిటి" అని. శంకరంగారు కోపంతో వణికిపోతూ: "అదుగో చూడండి మీముద్దుల కుక్క ఏంచేసిందో" అని గడపకేసి చూపించారు. అక్కడ టైగరు చెరిపింది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మా యింట్లో చాలాజాగ్రత్తగాఉండే టైగరు శంకరంగారి యింట్లో ఈ పని చేయడమేమిటి. పిరికి వాడిని మాస్తే గొర్రె తోకతో కరిచిందన్నట్లు మా టైగరుకికూడా శంకరంగారు లోకువగా కనిపించారు కాబోలు. ఆయన భార్య మూడు రోజులు ఇల్లంతా నీళ్ళతో ముంచెత్తితేకాని ఇలు శుద్ధికాదు. శంకరంగారు "ఏమిటయ్యా ఇందుకేనా మీరు కుక్కను పెంచుతున్నది? ఊళ్ళో వాళ్ల యిళ్లు పాడుచేసి రమ్మనా? ఎలాగైనా పెంచారు పెంటల మీద తిరిగే కుక్కని. మీ లాంటివారు ఇంటి కుక్కలనే పెంచుతారు" అని నోటికి వచ్చినట్లు పేలుతున్నారు. ఆయన ఏం తిటినా మారు మాటాడక పడవలసి వచ్చింది. నేనూ మా అన్నయ్యా ఆయన్ని చెరో చెయ్యీ పట్టుకొని బ్రతిమాలాం. ఇంక కుక్క బాధ లేకుండా చేస్తామనీ, కుక్కను ఇంటినుంచితరిమివేస్తామని, ఆయన గుమ్మందగ్గర మేమేబాగుచేయిస్తామనీ. కాని మేము ప్రార్థిస్తున్నకొద్దీ ఆయన మరింత పైకి ఎగురుతున్నాడు. కోర్టులో కేసు పెడతానని కూడా బెదరించడం మొదలు పెట్టాడు. చివరికి నాకు ఒళ్ళుమండి "సరే కోర్టుకు వెళ్ళాలని అంత సరదాగా ఉంటే అలాగే వెళ్లండి. హైకోర్టుకు కూడా వెళ్లండి" అన్నాను గట్టిగా. అప్పుడు ఊళ్ళోవాళ్లు మా పక్షం తీసుకొని "వారంతగా చెప్తూంటే వినక పోవడమేమిటి" అని కేకలు వేశారు. అప్పటికి శంకరంగారు నేలమీద సరిగా నిలబడ్డారు. మేము యింటికి తిరిగి వచ్చి మా పనిమనిషిని పంపి శంకరంగారి వీధి అరుగులూ, గుమ్మాలూ అన్నీ కడిగించాం.

అన్నయ్య ఇంటికివచ్చి కర్ర తీసుకొని తిన్నగా దొడ్లోకి పరుగెత్తి టైగరును అదే పనిగా కొటటం మొదలు పెట్టాడు. అది చూసి మా వదినగారు "అయ్యో అది చస్తుందేమో నండోయ్ కొంప తీసి. కుక్కను చంపిన పాపం గుడికట్టినా పోదట" అని గోల పెట్టింది. నేను కూడా భయపడ్డాను ఆ దెబ్బలకి టైగరు చస్తుందేమోనని. అన్నయ్యా దానిని మనం చేతులారా చంపడమెందుకు? అనక ఎవళ్ళచేతేనా మరో ఊళ్లో దిగబెట్టిస్తాను మళ్ళీ మన యింటికి రాకుండా" అన్నాను. అన్నయ్య "ఆగి ఈ సాయంత్రంలోగా ఈ పీడని వదిలించెయ్యి. వెనక కుక్క నానా అప్రతిష్ఠా తెస్తోంది. దీని మూలాన ఊళ్లోవాళ్లందరితో విరోధాలు వచ్చేటట్లున్నాయి" అన్నాడు. అలాగే ఆ సాయంత్రమే కోమటిరామున్న బళ్లవాళ్లు ధాన్యం బస్తాలు వేసుకొని మరో దూరపు ఊరు పోతూంటే వాళ్లకి అప్పగించాను టైగరుని. వాళ్లు దానిని తాళ్ళతో కట్టివేసి ఒక బండిలో పెట్టారు. అప్పుడు టైగరు చేసిన అల్లరి అంతా యింతా కాదు. గిలగిల కొట్టుకుంది. మొర్రోమని పెద్ద ఏడుపు పెట్టింది. బండివాళ్ళకేసి జాలిగాచూసింది. మాకేసీ జాలిగా చూసింది. అయినా బళ్ళ వాళ్లు బళ్లు తోలుకుపోయారు. గోపీ, మా అన్నయ్య పిల్లలూ కళ్లనీళ్లు పెట్టారు. మా వదినగారు కూడా అంది "పాపం వెర్రి ముండకి ఎంత ప్రేమో" అని.

ఆరాత్రే మా యింటికి దొంగలువచ్చారు. దొంగతనం జరగలేదు. అప్పుడే దొడ్లోకి వచ్చారు కాబోలు. అంతలో మా వదిన గారు మంచినీళ్లు త్రాగడానికిలేచి కిటికీలో నుంచి ఎవరో కదులుతుండటం చూసి 'వావావా' అని వెర్రికేక వేసింది. మేము కర్రలూ టేబిల్లైట్లూ పుచ్చుకొని దొడ్లోకి పరుగెత్తాము. దొంగలప్పటికే పారిపోయారు. చుట్టుప్రక్కల అన్నీ తుప్పలూ తోటలూ ఉండడంవల్ల వాళ్ళ వెనకాల పరుగెత్తడం ప్రమాదమని ఆగిపోయాం. ఆ రాత్రి మాకు చాలా భయం వేసింది. టైగరున్నా బాగుండు ననిపించింది." కాని ఉన్నది సరిగా ఉండ




కేశవర్ధని తో

కేశాలను వృద్ధి చేసుకోండి

చుండును పోగొట్టండి.
ఇక తలలో
దురద ఎందుకుండాలి?
వెంట్రుకలు



ఎందుకు రాలిపోవాలి? పసితనంలో నెరియుట మాన్పండి. నెరియుటం ఆలస్యం కానివ్వండి.

కేశవర్ధనితో కేశాలకు పునర్జీవంపోసి. అందం చేకూర్చండి

షాంపూ వాడి కేశ శుభ్రత, సువాసన పొందండి.

కేశవర్ధిని అ. 14; షాంపూ అ. 14, పోస్టేజి అదనం. అన్నిచోట్లా లభించును

కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు. No. 3

నేషనల్ సేల్సు & సర్వీసెస్ (సదరన్) లిమిటెడ్, [illegible] హాంపేట, బెజవాడ.

కాదూ, ఊళ్ళోవాళ్ళతో పేచీలు తెస్తోంది" అన్నాడు అన్నయ్య.

ప్రొద్దున్నే అన్నయ్య లేచి వీధి తలుపు తీసి తిన్నగా టైగరు పొట్టమీద కాలువేసి కెవ్వుమని కేక వేశాడు. అరి దీని మొగం తగలెయ్యా! మళ్ళీ వచ్చిందిరా" అన్నాడు. గోపీవాళ్ళు పరుగెత్తుకు వచ్చి టైగరును తీసుకువెళ్ళారు. టైగరు గంతులు వేస్తూ వాళ్ళ వెనకాలపరుగెత్తింది తన ఘనకార్యానికి పొంగి పోతున్నట్టుగా.

మధ్యాహ్నం వేళ కోమటిరామన్న బళ్ళవాళ్ళువచ్చారు"అయ్యగారూ మీ కుక్కను దిగబెట్టొచ్చామండి" అన్నారు.

"ఎక్కడ దిగబెట్టారేమిటి?'' అన్నాను నేను తమాషాగా.

"మూడు నాలుగు కోసులువెళ్ళిన తరువాత బాగా తుప్పలూ పొదలూ పెరిగి దారీతెన్నూ లేని చోట విడిచిపెట్టి"అంటూ నేఉన్నారు. ఇంతలో గోపీవాళ్ళ వెనకాల తోక ఆడిస్తూ టైగరు అక్కడికి సిద్ధమయింది-"ఇదేమిటి? ఇక్కడికి కెలా వచ్చింది!" అన్నారు.

"ఏమో తెల్లవారేసరికిచూస్తే గుమ్మంలో పడుకొని ఉంది" అన్నాను.

''మా కన్న బాగా ముందే వచ్చిందన్నమాట" అని వెలవెలపోతూ వెళ్ళిపోయారు బళ్ళవాళ్ళు.




## 2

టైగరును పగలుగొలుసుపెట్టి కట్టిపెడ్తున్నాం. రాత్రిళ్లు మాత్రం దొడ్లో విడిచిపెడ్తున్నాం. నాలుగురోజులు దొడ్లో ఏ వస్తువులు విడిచిపెట్టినా పోలేదుకాని తరువాత పరిస్థితి మళ్లీమామూలైంది. విచారిస్తే టైగరు రాత్రిళ్లు దొడ్లో వుండడం లేదని తేలింది. మాకన్న భయం దానికి. రాత్రి మేము విడిచి వెళ్లిన కాసేపటికే గోడదూకివచ్చి అరుగుమీద పడుకుంటోంది. మరోగొలుసు తెచ్చి పాతగొలుసుతో కలిపి రాత్రిళ్లుకూడా దానిని దొడ్లో నే నిమ్మచెట్టుకు కట్టిపెట్టడం మొదలుపెట్టాం. అది ఏడ్చింది. గొలుసు కొరడానికి ప్రయత్నించింది. వచ్చినవాళ్లందరినీ బతిమాలింది. అయినా దాని ఆటలేమీ సాగనీయలేదు. మళ్లా కొన్నాళ్ల వరకూ మాకు ఏ గొడవా లేదు.

ఒకరోజు అర్థరాత్రి వేళ మాకు ఎందుకో అనుమానం వేసి వంటింట్లోకి వెళ్లాం. గోడకు పెద్ద కన్నం కనిపించింది. మా గుండెలు ఆగిపోయాయి. కంగారుగా ఇంట్లో సామానులు చూసుకున్నాం. రెండు ఇత్తడి బిందెలూ, కొన్ని కంచుగిన్నెలూ, ఒక వెండిపళ్లెమూ కనిపించలేదు. దొడ్డోకి పరుగెత్తాం. మా కేకలకీ చప్పుళ్లకీ ఊళ్లోవాళ్లు కూడా పరుగెత్తుకు వచ్చారు. దొడ్డి అంతా వెతికాం. చుట్టుపక్కల తోటలు వెతికాం. అయినా లాభం లేకపోయింది. ఎక్కడా దొంగలజాడ కానరాలేదు. వస్తువులజాడా కానరాలేదు. అంతకు ముందెప్పుడూ కన్నంవేసి జరగలేదు మాఊళ్లో. అదే మొదటిసారి. ఊళ్లో వాళ్లు కూడా హడలిపోయారు. ఏదో గట్టి చర్య తీసుకుంటేకాని లాభంలేదన్నారు. ఎవరో అడిగారు "అయితే మీ కుక్క ఏం చేస్తోంది" అని. మేము అంతవరకూ టైగరు మాటే మరచిపోయాం వెళ్లి చూశాం. టైగరు నిమ్మచెట్టుపక్క కొన్ని తాటి వాసాలు పడిఉంటే వాటిమధ్య ఖాళీచేసుకొని హాయిగా నిద్రపోతోంది. నాకుకూడా అప్పుడు దానిమీద విపరీతమైన కోపం పొంగుకువచ్చింది. దానిని చితకకొట్టినా తప్పు లేదనిపించింది. అన్నయ్య కోపంపట్టలేక దాని డొక్కలో ఒక్కటి తన్నాడు. అది ఉలిక్కిపడి లేచింది. అన్నయ్య ఇంకా చాలాసార్లు తన్నాడు. అయినా అది అక్కడనుంచి కదలలేదు. కుయ్యో కుయ్యోమంటూ అక్కడే నిలబడిఉంది. చివరికి అన్నయ్యకే విసుకుపుట్టి చరచర లోపలికి నడిచాడు. వచ్చినవాళ్లు కూడా టైగరును తలోతన్నూ తన్ని లోపలికి నడిచారు.

మర్నాడు మధ్యాహ్నం పోలీసులు తయారయ్యారు. వాళ్ల పరీక్షలతో ప్రశ్నలతో మా ప్రాణాలు హైరాన పెట్టేశారు. కుక్కను గురించి ప్రస్తావన రాకుండా ఎలా ఉంటుంది. వాళ్లు పెద్దగా నవ్వివేశారు. అటువంటి కుక్కను పెంచుకున్నందుకు మేము కూడా నవ్వులపాలు కావలసివచ్చిందనుకున్నాం. పోలీసులు వెళ్లిన తరువాత అన్నయ్య మళ్లీ కర్రతీసుకుని వెళ్లి టైగరును వీధిచివరి వరకూ తరిమికొట్టి వచ్చాడు. పిల్లలతో చెప్పాడు అది మళ్లీ అటువస్తే తరిమికొట్టమని. అన్నయ్య పిల్లలు అలాగే చేస్తామన్నారు. ఈ దొంగతనం తరువాత వాళ్లకు టైగరుపట్ల విశ్వాసం పూర్తిగా పోయింది. గోపీ కొక్కడికే ఇంకా అభిమానం పోకుండాఉంది. టైగరు మా యింటికి రావడానికి చాలాసార్లు ప్రయత్నించింది కాని ప్రతిసారీ అన్నయ్య పిల్లలు బెడ్డలు పుచ్చుకొని తరిమికొట్టూ వచ్చారు. చివరికి టైగరు ఊళ్లోనే ఉండిపోయింది.

కాని నేను ఊళ్లోకి వెళ్లినప్పుడల్లా తోక ఆడించుకుంటూ నాదగ్గరకు పరుగెత్తుకు వచ్చేది. నేను దానికేసి చూడకుండా పోయేవాడిని. అయినా అది కొంతదూరం నా వెనకాలే వచ్చి తిరిగిపోయేది. గోపీ, తల్లీ ఆమె వైపు బంధువులింట్లో ఏదో శుభకార్యం ఉంటే వెళ్లారు. వాళ్లు బండిలో కాలవగట్టు వైపుకు పోతూండడం చూసింది కాబోలు టైగరు. ఎక్కడనుంచో పరుగెత్తుకువచ్చి బండికూడావచ్చి వాళ్లు బస్సు ఎక్కేవరకూ అక్కడ ఉండి తరువాత వెళ్లిపోయింది.

దానిని మా టైగరు అని చెప్పుకోవడం మేముమాని వేసినా ఊళ్లోవాళ్లుమాత్రం దానినింకా మా టైగరుకిందే ఎంచుతున్నారు. మేము కనిపించినప్పుడల్లా 'ఏమండోయ్ మీ టైగరు ఎలా పాడైపోయిందో చూశారా? పెంటకుప్పలమీద తిరుగుతూండగా చూశాను' అని ఒకరూ 'మీకుక్కను ఊళ్లో కుక్కలు కరిచివేశాయండి' అని ఒకరూ ఇలా చెపుతూనే ఉండేవారు. నాకు బాధతోచి "అది ఇక మా టైగరుకాదు"ని గట్టిగా చెప్పేవాడిని. కాని నన్ను చూసేసరికి తోక ఆడిస్తూ అది తయారవుతుండగా అది మాది కాదని చెప్పినా ఏం లాభం? దాని రూపమే మారిపోయింది. మళ్ళీ ఎముకలగూడులా తయారైంది. ఊరి కుక్కలు కరిచినచోట్లల్లా పుళ్లుపడ్డాయి గజ్జికూడా పట్టింది. దానిని చూడడానికే రోతపుట్టుతోంది. అది మాకళ్ళముందే అలా పాడైపోవడంమాస్తే బాధపడకుండా ఉండలేకపోతున్నాం కాని అది దగ్గరికివస్తే ఒక బెడ్డ

(55-వ పేజీ చూడండి)

# ★ టైగర్ ★

(24-వ పేజీ తరువాయి)

విసిరి దూరంగా తరిమివేయవలసివస్తోంది. అది ఎక్కడ ఎదురుపడుతుందో అనే భయంతో ఊళ్లోకి వెళ్ళడంకూడా తగ్గించుకోవలసివచ్చింది.

తరువాత కొన్నాళ్ళకి నేను రాజమండ్రీ వెళ్ళవలసివచ్చింది. అక్కడ మా స్నేహితుడొకడిదగ్గర కొన్ని సీమకుక్కపిల్లలుంటే ఒకటి నాకూడా తెచ్చాను. ఎర్రమూతితో, జాలికళ్ళతో, వాలవేసిన చెవులతో మల్లెపూవులా తెల్లగాఉండే కుక్కపిల్ల అది. దానికి 'రాణి' అని పేరుపెట్టాం. అది. వచ్చిందే తడవుగా ఇంట్లో అందరిదగ్గరికీ వరుసగా తిరిగి పరిచయంచేసేసుకుంది. టైగరు ఎన్నడూ ఇంట్లో అడుగుపెట్టి ఎరగదు. మనిషిమీదికి కాళ్లువిత్తేదికాదు. కాని రాణీ ఇల్లంతా స్వేచ్ఛగా తిరుగుతుంది. కుర్చీల మీదకాని కిందపడుకోదు. పరుపులమీదికి కూడావచ్చి పక్కనే పడుకుంటుంది. మనుషులమీది కెగురుతుంది. వెనక కాళ్ళమీద నిలబడి ముందుకాళ్లు ఊపుతూ ఎత్తుకోమని సైగచేస్తుంది. ఎత్తుకోగానే మూతిలోమూతి పెట్టి ముద్దుపెట్టించుకుంటుంది. ప్రతివారూ దానిని ఒకసారైనా ముద్దుపెట్టుకుంటే కాని ఊరుకోదు. దానికి అనేక కళాకళలు. ఒకసారి పాలుపోస్తే అన్నం ముట్టదు. మరొకసారి పాలుపోస్తేకాని ముట్టదు. నిజంగా రాణికి తెలుసు రాజ్యమేలడం. అది తెలివైనదికూడా. వీధిలోకివచ్చిన పెద్దమనుషుల మీద భౌంయ్‌మనదు. దగ్గరికివెళ్ళి వాసన చూస్తుంది. దానికి వచ్చినవాళ్లైతే ఎత్తుకోమంటుంది. నచ్చకపోతే వెనక్కి తిరిగివస్తుంది. బిచ్చగాళ్ళనిమాత్రం దగ్గరికి రానీయదు. ఎవడేనా కర్రఊపి బెదరించడానికి ప్రయత్నించాడో అది మరింత గొంతుకతో అరుస్తుంది. 'దానిచేష్టలుచూసి అన్నయ్యకూడా దానిని ఒళ్లోకూర్చోబెట్టుకుని కబుర్లుచెపుతున్నాడు. ఊళ్లోవాళ్లుకూడా దానినిచూసి ముచ్చటపడిపోతారు. ఆఖరికి శంకరంగారు కూడా దూరంనుంచే దానిని మెచ్చుకుంటున్నారు.

రాణీ వచ్చిన నాలుగురోజులకు అది అరుస్తూఉండడంచూసి వీథిలోకి వెళ్ళాను. ఏదో పెద్దకుక్క రాణీని కరవబోతోంది. కాని రాణీ ధైర్యంగా నిలబడి ఎదిరిస్తోంది. నేను దగ్గరికి పరుగెత్తివెళ్ళి రాణీని చేతుల్లోకి ఎత్తుకున్నాను. పెద్దకుక్కకేసి చూశాను. అది టైగరు. చేతుల్లో రాణీ అరుస్తూనేఉంది. టైగరు నన్నుచూసి తోక ఆడించసాగింది. అది రాణీని కరవబోయిందనే కోపంతో నేను కర్రతీసుకొని దానిని దూరంగా తరిమికొట్టాను. అది మళ్ళీ మా యింటిదగ్గరికి రాలేదు గోపీ వాళ్లూ తిరిగి వచ్చినరోజునతప్ప.

గోపీవాళ్లూ బండిలో వస్తూఉండడం చూసిందికాబోలు బండివెనకాలే మాయింటికివచ్చింది టైగరు. గోపీవాళ్లూ బండిదిగగానే రాణీ వీధిలోకి పరుగెత్తుకువచ్చింది. "గోపీ నీకోసం ఈ కుక్కపిల్లను తీసుకువచ్చానురా, రాణీ అని పిలు, వస్తుంది." అన్నాను వాడితో. 'రాణీ' అని పిలిచాడు. అది తోకఆడిస్తూ వాడిదగ్గరికి వెళ్ళింది. గోపీ సంతోషంతో ఎత్తుకున్నాడు. రాణీ వాడిని ముద్దుపెట్టుకుంది. వాడు కిలకిలమన్నాడు. ఇంతలో వెనకాల ఏడుపుశబ్దం విని వెనక్కి తిరిగాడు. "ఛీ ఛీ యిదేం కుక్క! పుచ్చుకుక్క. దానిని తరిమివెయ్యనాన్నా" అన్నాడు గోపీ. "అది టైగరురా" అని చెప్పాను. "ఛా చాలా అసయ్యంగాఉంది. కొట్టేయి నాన్నా" అని గోపీ రాణీని ఎత్తుకొని లోపలికి పరుగెత్తాడు. అన్నయ్య పిల్లలు వచ్చి టైగరును నిర్దాక్షిణ్యంగా తోలివేశారు. అది మళ్ళీ మా యింటి దాపులికి రాలేదు.

ఒకరోజున ఎవరో పరుగెత్తుకువచ్చి చెప్పారు. "ఏమండోయ్ మీ టైగరు బండి క్రింద పడిపోయిందండోయ్" అని. నేను వెళ్ళాను. రెండెడ్లబండి చక్రం దాని మీదుగా పోయిందట. ఇంకా చచ్చిపోలేదు. ప్రాణంకోసం ఆఖరి పెనుగులాటలో ఉంది. నేను వెళ్ళిన కొంచెంసేపటికి కన్ను తెరచింది. అటూఇటూ చూసింది. నాకేసికూడా చూసింది. దాని చూపులో ఏదో మార్పు వచ్చింది.

నన్ను గుర్తుపట్టినట్లుంది. ముందుకాళ్ళమీద లేవబోయింది. తోక ఆడిస్తున్నాననే అనుకొని ఉంటుంది బహుశా. తోక దాని వశంలో లేదని దానికి తెలిసిఉండదు. వెనకభాగం నేలమీదే ఉండిపోయింది. పుడకలాంటి ముందు కాళ్లమీద కొంతవరకూ లేచింది. ముందుకు రాబోయి పడిపోయి ప్రాణాలు విడిచివేసింది. నేను అక్కడకు వెళ్ళకపోయినా బాగుండేది. నేను వెళ్ళకముందే అది చచ్చిపోయినా బాగుండేది. నన్నుచూసి అది ఆఖరిసారి చేసిన చేష్ట నా మనస్సులో నాటుకుపోయింది.

ఇంట్లోవాళ్ళకీవార్త చెప్పాను. అన్నయ్య విననట్టుగా ఊరుకున్నాడు. మా వదినగారూ, మా ఆవిడమాత్రం "పాపం" అని ఊరుకున్నారు. గోపీ వాళ్ళతో చెప్పాను. వాళ్లు వినిపించుకోనేలేదు. రాణీతో ఆడుతూ కేరింతాలు కొడుతున్నారు.

ఇతరుల నాకర్షించే అందచందాలేమీ లేవు టైగరుకు. ఇతరులకు సాయపడే శక్తిసామర్థ్యాలూ లేవు. ఇతరులను వశపరచుకొనే నేర్పు లేదు. దానివల్ల ఎవరికీ ఏవిధమైన ఉపయోగమూ లేదు. అది ఇతరులనుంచి ఆశించినదికూడా ఏమీలేదు. పూటకి గుప్పెడు మజ్జిగలో తడిపిన మెతుకులే దానికి కావలసింది. ఆ కొద్ది మెతుకులకి బదులుగా తన దగ్గరఉన్న ఒక్క వస్తువూ అర్థంలేని వెర్రిప్రేమ ఈయగలదు. కాని ప్రతివిషయం ఉపయోగమా కాదా అనే దృష్టితో చూసే ఈ లోకంలో దాని వెర్రిప్రేమ ఎవరికి కావాలి! ★

---

# పథేర్ పాంచాలీ

(18 వ పేజీ తరువాయి)

అడవిచెట్ల వాసనలు, చింకిచదరలు, పాత పుస్తకాలు, క్రింద అలికిన నేల, కోసిపారేసిన పొగాకుకాడల మొదళ్ళ వాసనలు—అన్నీ కలిసి ఓ విచిత్రమైన వాసన క్రమ్ముకునేది.

అదొక ఊహాచిత్రం—

ఆ గ్రామంలో చల్లని చెట్ల నీడలదారిలో ఓ అమాయికపు పల్లెటూరి బాలుడు పుస్తకాలదస్తరం చంకనపెట్టుకుని అక్క వెనకాలే, తెల్లగా ఉతికి, మాసికలేసి కుట్టిన దుస్తులు వేసుకుని బళ్లోంచి తిరిగివస్తూ ఉంటాడు. ఒత్తుగా పట్టులా, మెత్తగా ఉండే వాడి జుట్టుని అమ్మ నున్నగా దువ్వి పంపుతుంది. చక్రాల్లాంటి వాడి కళ్ళలో విలక్షణమైన చూపు వ్యక్తమవుతూంటుంది. చుట్టూ చెట్లూ—పుట్టలూ—ఈమధ్యనున్న ఈకాస్తే వాడికి పరిచితమైన దేశం. ఇక్కడే తల్లి రోజూ అన్నం నోట్లోపెట్టి, తలదువ్వుతూంటుంది. అక్క గుడ్డలు తొడుగుతుంది. ఈ హద్దులు దాటిపోతే ఇంకేమున్నా ఉందా! అంతా అపార సముద్రమే! ఆ పసిహృదయానికి పట్టు దొరకదు......

ఒకనాడు బళ్లో వాడికి అపూర్వమైన ఒక అనుభవం కలిగింది. అది వాడి జీవితంలో ఒక నూతన అభిజ్ఞత.

ఆరోజు సాయంత్రం పైవాళ్లు ఎవరూ రాలేదు; బళ్లో బాతాఖానీ లేదు. పాఠాలు జరుగుతున్నాయి. అపూ వాచకం చదువుతున్నాడు. ఇంతలో పంతులుగారు "పలక తీసుకో, నేను చెపుతా, రాద్దువుగాని" అన్నాడు.

ఊరికే నోటితో చెపుతున్నా పంతులుగారు చెపుతున్నది తన పుస్తకంలోనిది కాదని, దాశరాయ్ పాంచాలీగీతావళిలోని పదాల్లాంటివి తనకు కంఠతః వచ్చినమాదిరే చెపుతున్నాడని అపూ గ్రహించాడు.